వీధి కుక్కల నియంత్రణకు ఆపసోపాలు

- నిలిచిపోయిన నియంత్రణ ఆపరేషన్లు
- గతంలో కుక్కల దాడిలో బాలుడి మృతి
- అప్పుడు హడావుడిగా నియంత్రణకు చర్యలు
- మళ్లీ మొదటికొచ్చిన సమస్య

నెహ్రూనగర్: వీధి కుక్కల సమస్య మళ్లీ మొదటికొచ్చింది. వీధుల్లో రచ్చచేస్తున్నాయి. నియంత్రణ చర్యలు కనిపించడం లేదు. ఏదైనా ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో అధికారులు హడావుడి చేస్తున్నారు. తరువాత పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో నగరంలో కుక్కల స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



నగరంలో వీధి కుక్కలు

ఏబీసీ ఆపరేషన్లు లేక..

నగరపాలక సంస్థ అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చేపట్టాల్సిన ఏబీసీ(యాంటీ బర్త్ కంట్రోల్) ఆపరేషన్లు విషయంలో మీన మేషాలు లెక్కిస్తున్నారు. వీధి కుక్కల దాడిలో ఏప్రిల్ 6వ తేదీన స్వర్ణభారతీ నగర్‌కు చెందిన ఓ బాలుడు మృతి చెందాడు. దిద్దుబాటు చర్యల్లో భాగంగా హడావుడిగా ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ సెంటర్‌లో ఆపరేషన్లు ప్రారంభించారు. అయితే ఏబీసీ ప్రక్రియ మున్నాళ్ల ముచ్చటగానే మారిపోయింది. ప్రస్తుతం వీధి కుక్కల దాడిలో ఎవరికి ఇబ్బందులు లేవు కదా... ఏదైన ప్రమాదం జరిగినప్పుడు స్పందిద్దామనే ధోరణిలో అధికారులు ఉన్నట్లు తెలుస్తుంది.

కుక్కల దాడి ఇలా..

గత కొద్ది నెలల క్రితం సంపత్‌నగర్‌లో ఓ బాలికపై కుక్క దాడి చేస్తున్న నేపథ్యంలో స్థానికులు కుక్కను తరిమివేయడంతో గాయాలపాలై ఆస్పత్రికి తరలించారు. గత కొంతకాలం కిందట హుస్సేన్‌నగర్, ఆంజనేయ కాలనీలో 9 మందిపై వీధి కుక్కలు దాడులు చేసి కండలు పీకేశాయి. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. అరుంధతి నగర్‌లో మరో బాలుడిని కుక్క తీవ్రంగా గాయపరిచింది. అంతేకాకుండా ప్రతి రోజు ఏదో ఒక చోట కుక్క కాటుకు గాయాల పాలై జీజీహెచ్‌కు వస్తున్న వారు పదుల సంఖ్యలోనే ఉంటున్నారు.

ఆపరేషన్లపై అభ్యంతరాలతో...

నగరపాలక సంస్థ లెక్కల ప్రకారం మొత్తం గుంటూరు నగరంలో 31,389 వీధి కుక్కలు ఉండగా జనవరి వరకు 4,477 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేశారు. నగరంలో వీధి కుక్కల నియంత్రణకు స్నేహ యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏటుకూరు రోడ్డులో ఏబీసీ సెంటర్‌లో వీధుల్లో తిరిగే కుక్కలను తీసుకువచ్చి వాటికి కుటుంబ నియంత్రణ(ఏబీసీ) ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఏబీసీ ఆపరేషన్లు చేసినందుకు గాను ఒక కుక్కకు రూ.రెండు వేల దాకా నగరపాలక సంస్థ సదరు సంస్థకు చెల్లిస్తుంది. అయితే జంతు ప్రేమికులు కొందరు ఏబీసీ ఆపరేషన్లలో లోపం జరుగుతుందని, స్టేరిలైజేషన్ సక్రమంగా ఉండటం లేదని, ఆపరేషన్ ద్వారా కుట్లు కూడా సక్రమంగా వేయడం లేదని, రికార్డ్స్ సక్రమంగా నిర్వహించడం లేదని యానిమాల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయడంతో ఈ సంవత్సరం జనవరి 9 నుంచి ఏబీసీ ఆపరేషన్లు ఆగిపోయాయి.



ఏటుకూరు రోడ్డులో కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు నిర్వహించే కేంద్రం

ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్లతో..

ఏప్రిల్ 6న బాలుడు చనిపోయిన తరువాత హడావుడిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీఓలను జారీ చేసి వెటర్నరీ డిపార్ట్‌మెంట్ నుంచి ముగ్గురు వైద్యులను నగరపాలక సంస్థ కేటాయించింది. సదరు ముగ్గురు వైద్యులు ఏప్రిల్ 23 నుంచి జూన్ 23వ తేదీ వరకు సుమారు వెయ్యి వీధి కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేశారు. ఇంకా 25 వేల కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేయాల్సి ఉంది. వీటికి సకాలంలో ఏబీసీ ఆపరేషన్లు చేయకపోవడంతో వీధి కుక్కల సంతానోత్పత్తి విపరీతంగా పెరిగిపోతుంది. ఏబీసీ ఆపరేషన్లు ఎప్పుడు ప్రారంభిస్తారని ఇన్‌చార్జి సీఎంహెచ్‌ఓ(డెప్యూటీ కమిషనర్) టి.వెంకటకృష్ణయ్యను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

క్లుప్తంగా

రాచకొండ విశ్వనాథ శాస్త్రికి నివాళి

లక్ష్మీపురం: మూడు దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యంలో ఎన్నో మేలి పంటలు పండించిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనల నిండా సమాజ హృదయం ఉంటుందని, ఆయన సిసలైన ప్రజా రచయిత అని ప్రముఖ విశ్లేషకులు అవధానుల హరి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన మనమూ పాడుదాం రండి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కళాసాధ అధ్యక్షులు బిళ్ళా అశోక్, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, కవి వి.వి.రావ్, రచయిత జమదగ్ని పాల్గొన్నారు.

ఆదిత్య హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్



గుంటూరు మెడికల్: పుట్టుకతో వచ్చిన గుండె జబ్బుకు విజయవంతంగా సర్జరీ చేసి రోగి ప్రాణాలు కాపాడినట్లు గుంటూరు కొత్తపేటలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. శనివారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ యోగి చాగంటి మాట్లాడుతూ పెదకాకాని మండలం తంగేళ్లమూడికి చెందిన వాణి, కంప్లీట్ ఏట్రియో వెంట్రిక్యులర్ కెనాల్ డిఫెక్ట్ సమస్యతో ఆస్పత్రిలో చేరినట్లు చెప్పారు. ఎడమవైపు ఉన్న మంచి రక్తం కుడివైపు ఉన్న చెడు రక్తంతో కలిసి ఊపిరితిత్తులకు ఎక్కువ మోతాదులో వెళ్లటం, రక్తం తక్కువ మోతాదులో శరీర భాగాలకు వెళ్లటం జరుగుతుందని వివరించారు. ఫలితంగా వాణికి ఆయాసం, అలసట వస్తున్నట్లు చెప్పారు. జూన్ 6న రోగి తమ ఆస్పత్రిలో జాయిన్ అయిందని, జూలై 6న విజయవంతంగా ఆపరేషన్ చేశామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటుగా మత్తు వైద్యులు డాక్టర్ రామరాజు, డాక్టర్ శిరీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ నిఖిల్ ప్రవీణ్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ మాధవి, పల్మనాలజిస్ట్ డాక్టర్ కాశిరాం పాల్గొన్నట్లు వెల్లడించారు. ఆదిత్య హాస్పటల్ మేనేజింగ్ డైరక్టర్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పాకనాటి కృష్ణప్రశాంత్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో ఇప్పటి వరకు 80కి పైగా గుండె ఆపరేషన్లు వందకు వంద శాతం సక్సెస్ రేటుతో విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, పనులు జరిగే సమయంలో రక్షణ చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఇంజినీరింగ్ సమీక్షా సమావేశంలో మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులును థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, పనుల్లో నాణ్యత లేకుంటే సదరు పనులను రద్దు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులకు తెలిపామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఏఈల వారీగా అభివృద్ధి పనులు పూర్తయిన వాటికి బిల్లుల చెల్లింపు కోసం నిధి పోర్టల్లో అప్ లోడ్ చేయాలన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా ఉన్న చెట్లను ఆన్ లైన్ లో అందుబాటులో ఉన్న యాప్ లో అప్ లోడ్ చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ సుందరామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, సెక్రటరీ బి.శ్రీనివాసరావు, ఏడీహెచ్ శాంతి, ఎంహెచ్ఓ సోమశేఖర్, మేనేజర్ బాలాజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం

నెహ్రూనగర్: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం డివిజన్ పరిధిలో తల్లి పాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు.

నగర వనాన్ని సందర్శించిన చిన్నారులు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన ప్రీ–ప్రైమరీ చిన్నారులు శనివారం క్షేత్రస్థాయిలో విజ్ఞానయాత్రగా పేరేచర్లలోని నగరవనాన్ని సందర్శించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రీ–ప్రైమరీ సమన్వయకర్త టి.శ్రీదేవి, ఇన్‌చార్జ్ కే.హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

నెహ్రూనగర్: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలను మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. శనివారం 'బాబు షూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా, గుంటూరు నగరంలోని 3వ వార్డులో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. సందర్భంగా అంబటి మాట్లాడుతూ అధికారంలో ఉంటే కేసులతో భయపెట్టి పోలీసులతో పాలన చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టినప్పటికీ భయపడే ప్రసక్తి లేదన్నారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. నూరిఫాతిమా మాట్లాడుతూ కూటమి నాయకుల మోసపూరిత హామీలపై ఇంటింటా నిలదీయాలని పిలుపునిచ్చారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ అని చెప్పి సూపర్ ఫ్లాప్ చేశారన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై నాయకులను నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో 3 వార్డ్ ప్రెసిడెంట్ సాంబ, కోర్ కమిటీ సభ్యులు ఎర్ర బాబు, చంటి పాల్గొన్నారు.



చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తున్న అంబటి రాంబాబు, నూరి ఫాతిమా

లివర్ సమస్యలను అశ్రద్ధ చేయవద్దు

లివర్‌ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ రజనీకాంత్

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలితో లివర్ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని చెన్నై గ్లోబల్ హాస్పటల్‌కు చెందిన లివర్‌ట్రాన్స్‌ప్లాంట్‌సర్జన్, గుంటూరు వైద్య కళాశాల 1991 బ్యాచ్ వైద్య విద్యార్థి డాక్టర్ రజనీకాంత్ అన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజ్‌లో వైద్య విద్యార్థులకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సులో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ రెండు నెలల్లో జీజీహెచ్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలు ప్రారంభించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి మాట్లాడుతూ లివర్ మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లో చేయటం వల్ల వైద్య విద్యార్థులకు నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స చాలా ఖరీదుతో కూడుకున్నదని చెప్పారు. అమెరికాలో లివర్ మార్పిడి ఆపరేషన్‌కు రెండుకోట్లు ఖర్చు అవుతుందని, యూకేలో 1.5 కోట్లు ఖర్చు అవుతుందని వెల్లడించారు. ఇండియాలో 25 నుంచి 30 లక్షలకే చేయవచ్చని వివరించారు. జీజీహెచ్ గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ అనుముల కవిత మాట్లాడుతూ కేవలం ఆల్కహాల్ వల్ల మాత్రమే లివర్ పాడవుతుందని అందరూ అనుకుంటారని చెప్పారు. హెపటైటిస్ వైరస్ సోకవటం, ఊబకాయం వల్ల కూడా నేడు లివర్ క్యాన్సర్‌లు సోకుతున్నాయన్నారు. చిన్న వయస్సులోనే మద్యపానం సేవించేవారిలో త్వరగా లివర్ పాడవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుందరాచారి, వేదికపై వైద్యులు రమణ, కవిత, రజనీకాంత్

పింగళి వెంకయ్య చిరస్మరణీయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య చిరస్మరణీయుడిగా నిలిచారని పట్టాభిపురంలోని శాఖా గ్రంథాలయ గ్రేడ్–3 గ్రంథ పాలకురాలు పి.సత్యశిరీష అన్నారు. శనివారం పట్టాభిపురంలోని శాఖా గ్రంథాలయంలో పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వీవీ ప్రసాద్ లింగం విద్యార్థులకు మహనీయుల జీవితగాథలతో కూడిన పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జె.వీరారెడ్డి, ఉపాధ్యాయురాలు వి.తనూజ పాల్గొన్నారు.

లక్ష్మీపురం: మన జాతీయ జెండా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని దీన్ని రూపొందించిన పింగళి వెంకయ్య భారత జాతి ఆత్మ గౌరవానికి ప్రతీక అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో పింగళి వెంకయ్య జయంతి శనివారం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

● మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

లక్ష్మీపురం: విద్యార్థి దశ నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టాభిపురం ఎస్ఐ నరహరి అన్నారు. గుంటూరు స్తంభాలగరువులోని మహాలక్ష్మమ పుల్లయ్య హైస్కూల్‌లో శనివారం ఈగల్ బృందం ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు నేతృత్వంలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

● విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి గుంటూరు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని నెక్స్ట్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించే వారు జవాబుదారీతనంతో ఉండాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ కోగంటి శ్రీకాంత్‌బాబు, చీఫ్ లెర్నింగ్ అధికారి డాక్టర్ కె.శ్రీవిద్య మాట్లాడారు. అనంతరం విద్యార్థి నాయకులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆర్ఏఎస్ఎస్ వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ రాజ్ పోపూరి పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూను సమర్థంగా ఎదుర్కోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగాన్వేషణలో ఉన్న విద్యార్థులు ఇంటర్వ్యూను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధి కె.యశ్వంత్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం ఇంటర్వ్యూలను ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యశ్వంత్ మాట్లాడుతూ నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు రెజ్యూమ్ రూపకల్పనలో విద్యార్థులకు సరైన అవగాహన అవసరమని చెప్పారు. హైదరాబాద్‌లోని జెన్‌ప్యాక్ట్ అసిస్టెంట్ హెచ్ఆర్ మేనేజర్ ఎస్.సాయిబాబా మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్వ్యూలు ఎదుర్కొనే నైపుణ్యాలతో పాటు సంపూర్ణమైన ప్రొఫెషనల్ రెజ్యూమ్ తయారీ విధానం, డ్రెస్‌కోడ్, సెల్ఫ్ ఇంట్రడక్షన్ శైలి వంటి అంశాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పీఎం ప్రసాద్, కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహిళలకు హోమ్ బేకింగ్‌లో శిక్షణ

గుంటూరు మెడికల్: ఏపీ చాంబర్స్, ఐటీసీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళ సాధికారత కోసం హోమ్ బేకింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మహిళా వ్యాపారవేత్తల గుంటూరు శాఖ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి మమత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు, ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు గుంటూరు అరండల్ పేట మూడోలైన్‌లోని యోగి భవన్‌లో శిక్షణ తరగతులు ఉంటాయని వెల్లడించారు.

స్విగ్గీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురం: స్విగ్గి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు కోరారు. గుంటూరు లాడ్జిసెంటర్‌లో స్విగ్గీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పే–ఔట్ విధానానికి కొత్త విధానానికి సగానికి సగం వేతనం కోత విధించబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇన్సెంటివులు రద్దు చేశారని, అనారోగ్యం, బంధువులు మరణించినా ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులు రెండు రోజులు డ్యూటీ ఆఫ్ అయితే వారి ఐడీలు బ్లాక్ చేస్తున్నారని అన్నారు. డ్యూటీ ఆఫ్ అయితే ఎలాంటి వేతనం చెల్లించని స్విగ్గీ సంస్థ వారి ఐడీలు బ్లాక్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సంస్థ యాజమాన్య ప్రతినిధులు సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అందువలన మూడు రోజుల నుండి స్విగ్గీ కార్మికుల సమ్మె చేస్తున్నారని, వెంటనే సమస్యలు పరిష్కారానికి యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిపి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, షేక్ జబీర్, బి. హిమ శ్యామ్ సింగ్, వి.సందీప్, కె.మోక్షకుమార్, ఎ.రంగనాథ్, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సిస్టర్స్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

నెహ్రూనగర్: నన్స్‌పై చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో అన్యాయంగా అరెస్టు చేసి వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు జయసుధ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరు సిస్టర్లు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఓ ఆస్పత్రిలో గిరిజన యువతులకు ఉద్యోగాలు ఇప్పించేందుకు తీసుకుని వెళుతున్న సమయంలో భజరంగ్‌దళ్ కార్యకర్తల తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు వారిని అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం డాక్టర్ ద్వారం లక్ష్మీ శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. శ్రీదాస సాహిత్య ప్రాజెక్ట్, తితిదే, శ్రీకంచి కామకోటిపీఠ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం (గుంటూరు), ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫైర్ ది ఆర్ట్స్ రీజనల్ సెంటర్ (తిరుపతి), ద్వారం లక్ష్మీ అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్(తిరుపతి) సంయుక్త ఆధ్వర్యంలో సంగీత నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ పాలక మండలి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. నారాయణ తీర్థులు ప్రబోధించిన నమ సంప్రయోగ వైభవాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ దీవి నరసింహదీక్షితులు వివరించారు. అనంతరం దీక్షితులను సత్కరించారు. డాక్టర్ లక్ష్మీ అన్నమయ్య, పురందరదాసు, రామదాసు, వెంకటసుబ్బాయర్ వాగ్గేయకారుల రచనలు, రాగం, తానం, పల్లవి గానం చేశారు. వయోలిపై పెరవలి నంద కుమార్, మృదంగంపై కె.సద్గురుచరణ్, ఘటంపై శ్రీహరిబాబు వాయిద్యం అందించారు.

పెళ్లికి ముందు హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరి

గుంటూరు మెడికల్: పెళ్లికి ముందు హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరి చేయాలని, దీనికి ప్రత్యేకంగా ఒక చట్టం తీసుకొని రావాలని నేషనల్ లివర్ అండ్ గ్యాస్ట్రో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.షేక్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీనిపై దృష్టి సారించాలని కోరారు. శనివారం ఆర్.అగ్రహారంలోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

- కమిషనర్ పులి శ్రీనివాసులు
- ఓ హోటల్ సీజ్‌కు ఆదేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పార్కింగ్ లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే హోటల్స్, రెస్టారెంట్లు, టీ, టిఫిన్ స్టాళ్లపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం శ్రీకృష్ణదేవరాయ నగర్, భాగ్యనగర్, తుఫాన్ నగర్, పెద్ద పలకలూరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల వలన ట్రాఫిక్ సమస్య రాకుండా ఇప్పటికే రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు చేపట్టామన్నారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లోని రవి క్రేజీ ఫుడ్స్‌ని తక్షణం సీజ్ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. స్తంభాలగరువు, భాగ్యనగర్, తుఫాన్ నగర్‌లలో పర్యటించి, ఆయా ప్రాంతాల్లో ఇళ్ల యజమానులు ఆస్తి, నీటి పన్ను చెల్లించడం లేదని గుర్తించారు. పెద్దపలకలూరులో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లో వర్షం, మురుగునీరు నిలిచి దోమలతో ఇబ్బంది పడుతున్నామని ప్రజల ఫిర్యాదు మేరకు ఆయా స్థల యజమానులకు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని, స్పందించని వారి స్థలాల్లో నగరపాలక సంస్థ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులకు సూచించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్ ఉన్నారు.

టిడ్కో గృహాల్లో యాజమానులే ఉండాలి

నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తయిన వారు కేటాయించిన గృహాలలో యాజమానులు ఈ నెల 20వ తేదీలోగా నివాసం ఉండాలని, లేకుంటే కేటాయింపు రద్దు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలోని 7,472 టిడ్కో ప్లాట్లకు గాను 5,052 ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగిందని, వాటిలో కేవలం 1,565 ప్లాట్లలోనే యాజమానులు నివాసం ఉంటున్నారన్నారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన ప్లాట్లలో తాము నివాసం ఉండకుండా ఇతరులకు అద్దెకు ఇస్తున్నారని, అద్దెకు ఉంటున్న వారు అసాంఘిక కార్యక్రమాలు చేస్తూ చుట్టుపక్కల నివాసితులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి ప్లాట్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పన్నుల వసూలుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

నగరంలో సోమవారం నుంచి అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో, అడ్మిన్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ పెంపుపై రెవెన్యూ అధికారులు, అడ్మిన్ కార్యదర్శులు దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రవి కిరణ్ రెడ్డి, మదన్ గోపాల్, సాదిక్ బాష, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ సెంటర్‌లలో ముగిసిన తనిఖీలు

గుంటూరుమెడికల్: సృష్టి ఐవీఎఫ్ సెంటర్ పనితీరుపై ఆరోపణలు వచ్చి, కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఐవీఎఫ్ సెంటర్‌లలో శుక్రవారం నుంచి తనిఖీలు జరుగుతున్నాయి. జిల్లాలో 27 ఐవీఎఫ్ సెంటర్లు ఉండగా, శుక్రవారం 17 సెంటర్లలో తనిఖీలు జరగ్గా, శనివారం పది సెంటర్లలో వైద్య అధికారులు తనిఖీలు చేశారు. గుంటూరు రమేష్ హాస్పటల్‌లోని ఐవీఎఫ్ సెంటర్‌లో గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తనిఖీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ఐవీఎఫ్ సెంటర్లలో డాక్యుమెంట్లు సక్రమంగా మెయిటెన్స్ చేయడం లేదని, సంతానం లేని దంపతులకు చికిత్సలు అందించేందుకు తీసుకునే ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ఉండటం లేదనే విషయాన్ని తాము తనిఖీల్లో గుర్తించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. రెండురోజుల్లోగా ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో పెట్టాలని, రికార్డులు సక్రమంగా మెయిటెన్స్ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.



గుంటూరు రమేష్ హాస్పిటల్‌లో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

ధూమపానంతో ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు అవకాశం

గుంటూరు ఎడ్యుకేషన్: ధూమపానం, గంజాయి సేవనం వంటి చర్యలతో ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదముందని ఎన్నారై మెడికల్ కళాశాల పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆర్.రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఫార్మసీ ప్రాక్టీసు విభాగాలు సంయుక్తంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణ, చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం పాల్గొన్నారు.

లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

నగరంపాలెం: లాటరీ టికెట్లను విక్రయిస్తున్న ఇద్దరిని శనివారం లాలాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పట్నం బజార్ తమిళనాడు బ్యాంకు ఎదురు సందులో కూరపాటి రంగారావు, మునావత్‌గునియాలు లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారు. ఈ మేరకు వారి ఇద్దరిని అరెస్ట్ చేసి, రూ.9,630 స్వాధీనం చేసుకున్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

లక్ష్మీపురం: తెల్లవారుజామున ఇంటి బయట ఉన్న బావి గట్టుపై కూర్చొని తూలు రావడంతో బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. ఏటీ అగ్రహారం 2/2వ లైన్‌కు చెందిన షేక్ రాజాసాహెబ్(60) భార్య ఖాసింబి నివసిస్తున్నారు. రాజాసాహెబ్ గతంలో ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని మార్చురీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేశారు. మద్యానికి బానిస అయి అనారోగ్యంతో గుంటూరు నగరాలులోని ఐడీ ఆస్పత్రిలో నెల రోజుల పాటు చికిత్స పొంది తిరిగి ఇంటికి వచ్చాడు. అయితే శనివారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వచ్చి బావిపై కూర్చునే సరికి తూలు రావడంతో బావిలో పడిపోయాడు. దీన్ని గమనించిన స్థానికులు నగరంపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకుని అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయంతో బావిలో పడి పోయిన రాజాసాహెబ్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య ఖాసింబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.